ఆహ్వానం..

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 12 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు.. కేపీహెచ్బీ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు జనగాం సురేశ్ రెడ్డి తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. 16న కీసరలో జరిగే జనగాం వంశీ కృష్ణా రెడ్డి, సౌజన్య వివాహానికి హాజరై.. దంపతులను ఆశీర్వదించాలని కోరారు.

అసెంబ్లీ సాక్షిగా..

పచ్చి అబద్ధాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 12: సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పచ్చి అబద్ధాలు చెప్పించారని.. అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని సత్య దూరమైన అంశాలను చెప్పడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎస్సీ విభాగం సీనియర్ నాయకుడు నపారి చంద్రశేఖర్ విమర్శించారు. గవర్నర్ చేత .. రైతులకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా, వరికి బోనస్ రూ.500 ఇచ్చామని చెప్పడం మిలీనియం జోక్ గా వర్ణించారు. ఎండిపోతున్న పంటలను చూసి 446 మంది రైతులు చనిపోతే వారిని ఆదుకుంటామని ఒక మాట చెప్పకపోవడం బాధాకరమన్నారు. కొద్ది మందికి ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అందిస్తూ.. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు, అంబేద్కర్ అభయ హస్తం ద్వారా రూ.12 లక్షల సాయం అందిస్తామని హామీ ఇచ్చారని.. వీటి అమలు కోసం బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 12 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని , అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 42 మందికి రూ. 16.16 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టాలలో ఉన్న పేదలను ఆదుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ హయంలోనే సీఎం రిలీఫ్ ఫండ్ ప్రవేశపెట్టి అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ : శాసనసభ సమావేశాలకు మాజీ సీఎం కేసీఆర్ తో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే మాధవరం సహకారంతో అభివృద్ధి

బాలానగర్ : క్రైస్తవ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తానని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం మల్లికార్జున కాలనీలో కార్పొరేటర్ హస్మత్‌పేటకు చెందిన క్రైస్తవులు కలిశారు. క్రైస్తవ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆశ, పాస్టర్లు ఏ.సుధాకర్, జాన్, విక్టర్ సేలం, డి. సుధాకర్, శాంతి, రత్నరాజు, పీటర్, దాసు, అనిల్ కుమార్, కరుణాకర్, కవిత, జయరాజు, విల్సన్, స్టీవెన్ పాల్గొన్నారు.

బిల్డర్లకు పర్మిషన్ల విషయంలో ఇబ్బందులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న బిల్డర్ అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు

మాదాపూర్ : బిల్డర్లు పర్మిషన్ల విషయంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బిల్డర్ అసోసియేషన్ చైర్మన్ మిర్యాల రాఘవరావు అన్నారు. మియాపూర్ లోని ఎస్ వీ ఎం గ్రాండ్ లో బుధవారం గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ రాఘవరావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రర్ చిట్టిమల్ల అశోక్ కుమార్, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రర్ విజయ భాస్కరరావు, మేడ్చల్ సబ్ రిజిస్ట్రర్ మధు బాబు, టీఎంటీ మార్కెటింగ్ హెడ్ రాజీవ్ హాజరయ్యారు. బిల్డర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి అందరూ సమాయత్తం కావాలన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ.. ప్రస్తుత పరిస్థితులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని బిల్డర్లకు ఇబ్బందులు కలవకుండా చూడాలని కోరారు. చిన్నచిన్న స్థలాలకు సెట్‌బాక్స్‌లో కొంతమేర తగ్గించాలని డిమాండ్ చేశారు. సిటీ అభివృద్ధిలో బిల్డర్ల పాత్ర కీలకమని డిస్ట్రిక్ రిజిస్ట్రర్ అశోక్ అన్నారు. కార్యక్రమంలో బిల్డర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మియాపూర్ : ఆల్విన్ కాలనీ లోని శ్రీ ఎర్ర పోచమ్మ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ 2వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మాలతో అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు పాల్గొని పూజలు చేశారు.

కళాశాలల్లో ఫీజులు పెంచొద్దు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 12 : ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల ఫీజులు పెంచకూడదని కోరుతూ.. జేఎన్టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు టి ఏఎఫ్ఆర్సీ చైర్మన్ గోపాల్ రెడ్డికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ఫీజులను నిర్ణయించాలని.. ఆయా కళాశాలల నివేదికల ఆధారంగా ఫీజును పెంచవద్దని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు జల్లెడ బ్రహ్మం, పూల అరవింద్, నితిన్, జువ్వాది దిలీప్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి నిధులివ్వాలి

ఓంకార్ నగర్ లో సమావేశంలో పాల్గొన్న మహిళలు

మియాపూర్, మార్చి 12: అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (AIFDW) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఓంకార్ నగర్ లో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి తాండ్ర కళావతి మాట్లాడుతూ.. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మహిళా సంక్షేమానికి 20 శాతం నిధులు కేటాయించాలని, గ్రామ స్థాయి నుంచి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ నాయకులు జి.శివాని, బి .విమల,జి. లలిత పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 12 : కేపీహెచ్‌బీ కాలనీ 6వ పేజ్‌లోని శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచముఖ ఆంజనేయస్వామి, దక్షిణామూర్తి స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం జరిగిన ఈ వేడుకల్లో కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్, పలువురు నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ..

వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, మార్చి 12 : భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం సిరియాది జిల్లా బలోడా బజార్ ఆజాద్ చౌక్‌కు చెందిన భవన్ రజాక్ (40) కొన్ని రోజుల కిందట నగరానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. కొంపల్లి లో అమృత ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణ పనుల్లో భాగంగా పనులు చేసుకుంటూ ఉన్నాడు. ఈ నెల 11న ఉదయం 9 గంటల సమయంలో రెండో అంతస్తులో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు ముక్కుకు తీవ్రమైన గాయం కావడంతో స్థానికులు హుటాహుటిన ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆ రోజు అర్ధరాత్రి చికిత్స పొందుతూ భవన్ రజాక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు నిర్మాణ రంగ సంస్థ యాజమాన్యం కనీస మౌలిక వసతులు, నిబంధనల మేరకు కల్పించక పోవడం మూలంగానే తన భర్త మృతికి కారణమైందని అతడి భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ – రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 21, కాకర 45, బీర 55, క్యాబేజీ10, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 45, చిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 31, ఆలుగడ్డ 21, కీరా 18, దోసకాయ 25, సోర 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 30, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 55, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠాని 50, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నెప్రోప్లేస్ రికార్డ్ స్థాయిలో

కిడ్నీ హెల్త్ స్క్రీనింగ్

కొండాపూర్, మార్చి 12 : ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకొని మెట్రో ప్లస్ డయాలసిస్ కేర్ నెట్‌వర్క్ 26 నగరాల్లో రికార్డు స్థాయిలో కిడ్నీ హెల్త్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను నిర్వహించింది. మార్చి 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో పూర్తిచేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినట్లు సీఈవో, వ్యవస్థాపకుడు విక్రమ్ ఉప్పల తెలిపారు. మూత్రపిండాల ఆరోగ్యం పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెప్రోప్లేస్ నిబద్ధతతో ముందుకు సాగుతుందన్నారు.

సర్టిఫికెట్ అందుకుంటున్న నెప్రోప్లేస్ ప్రతినిధులు

అక్రమంగా ఆస్తి బదలాయింపు

కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌పై కొనసాగుతున్న విచారణ

జగద్గిరిగుట్ట / దుండిగల్ : అక్రమ వారసత్వ హక్కు ముసుగులో జరిగిన భూ కుంభకోణం రెవెన్యూ అధికారుల మెడకు చుట్టుకున్నది. కోర్టు ఆదేశాలతో జగద్గిరిగుట్ట పోలీసులు కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో రెహమాన్‌పై విచారణ కొనసాగిస్తున్నారు. గాజులరామారం డివిజన్ లాల్‌సాబ్ గుడా సర్వే నం. 402, 403, 422లో సుధాకర్‌కు 5.2 ఎకరాలు ఉన్నది. ఐదేండ్ల కిందట, అతని భార్య అంతకుముందే చనిపోయారు. వార సత్వ హక్కు పేరుతో కర్నూలుకు చెందిన సుధాకర్ సోదరుడి కుమారుడు రెవెన్యూ అధికారులను సంప్రదించి ఆస్తి బదలాయించుకున్నాడు. తప్పుడు పత్రాలతో మార్పిడి జరిగిందని సుధాకర్ భార్య తరపు బంధువులు కోర్టును ఆశ్రయించారు. సుధాకర్ హైదరాబాద్‌లో చనిపోగా కర్నూల్‌లో చనిపోయినట్లు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. రెండు నెలల కిందట ఎమ్మార్వో పాత్రపై జగద్గిరిగుట్టలో, ఆస్తి పరిధిలోని సూరారం పీఎస్‌లో, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఏ పత్రాలు, వివరాలు ఆధారంగా భూ మార్పిడి జరిగిందో విచారణ ప్రారంభించిన జగద్గిరిగుట్ట పోలీసులకు ఎమ్మార్వో రెహమాన్ అందుబాటులోకి రాలేదు. రెండు నెలలుగా విధులకు హాజరు కావడం లేదు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ ఉన్నతాధికారులు శాఖపరమైన విచారణ చేస్తున్నట్లు సీఐ నరసింహ తెలిపారు.

కాలనీలను అభివృద్ధి పథంలో నడిపిస్తా



కార్పొరేటర్ శ్రీకాంత్ కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ ప్రతినిధులు

మియాపూర్ : ఎఫ్‌సీఐ కాలనీలోని హారిక టవర్స్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కాలనీ వాసులు సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు.

కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ మెరుగైన విద్యుత్ వ్యవస్థ వంటి మౌలిక వసతులతో కాలనీలను తీర్చిదిద్దుతానన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధికి పనులను చేపట్టి డివిజన్‌ను ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుప్రజ, హారిక టవర్స్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు మూర్తి , పార్థ, శివ, నరేంద్ర, నవీన్, సాయికిరణ్, సీతారామశాస్త్రి, చంద్రశేఖర్, నరసింహ మూర్తి, రమేష్, శ్రీకాంత్, అపార్ట్‌మెంట్స్ వాసులు పాల్గొన్నారు.

నేడు నాగారంలో

తైబజార్ వేలం

మేడ్చల్ కలెక్టరేట్ : మున్సిపల్ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలం వేస్తున్నట్లు కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నాగారం మున్సిపల్ పరిధిలో 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, పాటలో పాల్గొనే వారు రూ. 2లక్షల మున్సిపల్ కమిషనర్ నాగారం పేరున డీడీ తీసి గురువారం ఉదయం 11.30గంటల్లోపు కార్యాలయంలో సమర్పించి మధ్యాహ్నం12 గంటలకు వేలంలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు.

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

మల్కాజిగిరి : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ ఇచ్చారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విస్మరించిందన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమం లో మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్ ఉద్యమకారులు పాల్గొన్నారు.